ఉపాధ్యాయులపై ఇతరుల పర్యవేక్షణ సరికాదు

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోటేశ్వరప్ప, ఈశ్వరయ్య

కోటేశ్వరప్ప, ఈశ్వరయ్య

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వందరోజుల ప్రణాళిక కార్యక్రమం పర్యవేక్షణకు ఉపాధ్యాయులపై విద్యాశాఖతో సంబంధం లేని ఇతర శాఖలకు చెందిన అధికారులను నియమించడం సరికాదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కోటేశ్వరప్ప, ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఉన్నతాధికారులు వందరోజుల ప్రణాళికను రూపకల్పన చేసి, పదవ తరగతి విద్యార్థుల పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలను సాధించాలని అమలు చేయడం సంతోషకరమైనప్పటికీ, సెలవు రోజుల్లో కూడా పని చేయాలని చెప్పడం సరికాదన్నారు. రోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రణాళిక అమలు చేస్తున్నప్పటికీ సాయంత్రం 5 నుంచి 5 గంటల మధ్యలో ఒక స్లిప్ టెస్ట్ నిర్వహించి, 24 గంటల్లో ఆ పరీక్ష పేపర్లను దిద్ది, ఆన్‌లైన్‌లో మార్కులు అప్‌లోడ్ చేయమనడం విద్యార్థులు, ఉపాధ్యాయులకు తీవ్రమైన మానసిక ఒత్తిడిని కలిగిస్తోందన్నారు. ఇలా కార్యక్రమం కొనసాగుతుంటే మరోపక్క విద్యాశాఖతో సంబంధం లేని మెడికల్, రెవెన్యూ, పోలీస్, ఇంజినీరింగ్, పంచాయతీరాజ్, పౌర సరఫరాలు వంటి శాఖల అధికారులతో ఒక టీంను ఏర్పాటు చేసి పాఠశాలల్లో అభ్యసనా స్థాయిలను పరిశీలించమని చెప్పడం ఉపాధ్యాయుల ఆత్మ గౌరవాన్ని కించడమే అన్నారు. కావున ఇతర శాఖలకు చెందిన అధికారులను నియమించడం ఉపసంహరించుకోవాలన్నారు.

7,8న జిల్లాస్థాయి

'పాల'పోటీలు

పాల ఉత్పత్తి, పశుపోషణపై అవగాహన

కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పాడి రైతులకు అధిక పాల ఉత్పత్తి, మేలు జాతి పశుపోషణపై అవగాహన కల్పించే నేపథ్యంలో జిల్లాస్థాయి పాలపోటీలను ఆకుతోటపల్లి గ్రామంలో జనవరి 7, 8వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం నాడు కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో "అనంత పాలధార" పేరుతో రూపొందించిన కరపత్రికలు, గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాడి రైతులకు అధిక పాల ఉత్పత్తి, మేలు జాతి పశుపోషణపై అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. 7,8న పాల పోటీలు, 9న బహుమతి ప్రధానం, ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం, మేలు జాతి దూడలు ప్రదర్శన ఉంటుందన్నారు. అధిక పాల దిగుబడి ఉండి పోటీలో పాల్గొనదలచిన పశు పోషకులు సమీప రైతు సేవా కేంద్రం, పశు వైద్య కేంద్రాల్లో సంప్రదించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా।।పి.ప్రేమ్ చంద్, ఉప సంచాలకులు డా।।వై.రమేష్ రెడ్డి, సహాయ సంచాలకులు డా।।ఎ.రత్నకుమార్, డా।।వి.రామచంద్ర రెడ్డి, డా।।కెఎల్.శ్రీలక్ష్మి, పశు వైద్యాధికారి డా।।ఎ.గోల్డ్ స్మన్ పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్

అనంతపురంలో బైక్‌ర్యాలీ చేపట్టిన సిఐటియు నాయకులు, కార్మికులు

'కార్మికోత్సాహం'..!

- అనంతలో సిఐటియు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ
- జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సిఐటియు అఖిల భారత మహాసభల జయప్రదం కోరుతూ అనంతపురం జిల్లా కేంద్రంలో కార్మికులు ఉద్యమనినాదంతో ముందుకు కదిలారు. మహాసభల్లో తామూ భాగస్వాములం అవుతామంటూ సిఐటియు జెండాలు చేతబట్టుకుని ప్రదర్శన చేపట్టారు. 'సిఐటియు జిందాబాద్' అనే నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన జాపుజాతాకు కార్మికుల నుంచి మహా స్పందన లభించింది. దానికి కొనసాగింపుగా సోమవారం నాడు అనంతపురం నగరంలో ఛలో విశాఖ పేరుతో సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సిఐటియు నగర కార్యదర్శి ఎస్.ముత్తుజా అధ్యక్షతన నిర్వహించిన బైక్ ర్యాలీ ప్రెస్‌క్లబ్ నుంచి ప్రారంభమై సప్తగిరి సర్కిల్ మీదుగా పాతూరు గాంధీ బజార్, నీలం ట్యాకీస్ రోడ్డు, ఆర్‌టిసి బస్టాండ్, చంద్ర హాస్పెటల్ మీదుగా రైల్వే స్టేషన్ వరకు కొనసాగింది. బైక్ ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న కార్మికులు వారి ఐక్యతను చాటారు. మహాసభల ఆవశ్యకతను తెలియజేస్తూ నాయకులు చేసిన ప్రసంగాలు కార్మికులను ఉత్తేజపరిచాయి. సిఐటియు 18వ అఖిలభారత మహాసభల సందర్భంగా విశాఖపట్నంలో జనవరి 4వ తేదీన నిర్వహించే బహిరంగ సభలో తామూ పాల్గొంటామంటూ కార్మికులు బైక్‌యాత్ర వద్ద నాయకులకు తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో కార్మికుల హక్కులు హరింపునకు గురవుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం సిరసావహిస్తూ కార్మికులను కష్టాల్లో నెట్టేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌లు అమలు చేసి కార్మికులను వెట్టిచాకిరి, బానిసత్వంలోకి నెట్టివేస్తూ కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాసే విధానాలు ప్రమాదకరం అన్నారు. కార్మిక వర్గం ఏకమై హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. లేబర్‌కోడ్‌లను రద్దు చేసేంత వరకు సిఐటియు పోరాటం చేయనుందన్నారు. జనవరి 4వ తేదీన విశాఖ పట్నంలో జరిగే సిఐటియు 18వ అఖిల భారత మహాసభ బహిరంగ సభలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.గోపాల్, నగర అధ్యక్షులు వై.వెంకటనారాయణ, నగర ఆఫీస్ బేరర్స్ ఎర్రిస్వామి, తిరుమలేసు, మెడికల్ హెల్త్ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు నల్లమ్మ, మున్సిపల్ యూనియన్ మంత్రి వరలక్ష్మి, మరియమ్మ, పెన్న, గూడ్‌సెడ్ హమాలీ యూనియన్ మేస్త్రీలు మసూద్, సుధాకర్, సులేమాన్, ఎస్టేట్ హమాలీ యూనియన్ నూర్‌బాషా, ఆటో యూనియన్ నాగరాజు, ఆది పాల్గొన్నారు.

ఆర్టీసీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి : సిఐటియు

సమావేశంలో మాట్లాడుతున్న నాగేంద్రకుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఏపీఎస్ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఆన్ కాల్ డ్రైవర్లు, అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. అనంతపురం నగరంలోని ఖాజానగర్ మున్సిపల్ యూనియన్ కార్యాలయంలో సోమవారం నాడు ఆర్టీసీ డిపోలలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఆన్ కాల్ డ్రైవర్లు, అద్దె బస్సు డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఏపీఎస్ ఆర్టీసీ (ఏపీపిటిడి) కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ డి.అనిల్ కుమార్ అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో నాగేంద్రకుమార్ పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీలో పనిచేస్తున్న అన్ని కేటగిరీల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఆన్ కాల్ డ్రైవర్లు, అద్దె బస్సు డ్రైవర్లకు లేబర్ సర్కులర్ ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. ప్రతి ఆరు నెలలకు కార్మిక శాఖ జారీ చేసే వేతన సవరణ సర్కులర్లను అన్ని డిపోల నోటీసు బోర్డులపై ప్రదర్శించాలన్నారు. వీరందరికీ గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. వారంలో ఒక రోజు సెలవు, క్యాజువల్, సిక్ లీవులు వర్తింప చేయాలన్నారు. మహిళా ఉద్యోగులకు మెటర్నిటీ సెలవులు ఇవ్వాలన్నారు. డిపో గ్యారేజీల్లో పనిచేసే సిబ్బందికి ప్రభుత్వ సెలవులన్నింటినీ వర్తింపజేయాలన్నారు. ఈఎస్ఐ పరిధిలోకి తీసుకుని కార్డులు ఇవ్వాలని కోరారు. కార్మిక చట్టం ప్రకారం వేతనాలు ఇచ్చి రోజుకు 8 గంటలు మాత్రమే పనులు చేయించుకోవాలని సూచించారు. ఈ సమస్యలన్నింటిపై కార్మికుల పక్షాన సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్, ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, రవి కుమార్, శంకర్, గౌస్ పీరా, బాషా, లోకేష్, నాగేంద్ర పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ వినతులపై నిర్లక్ష్యం వద్దు : ఆర్డీవో

ప్రజాశక్తి-కళ్యాణదుర్గంటౌన్

వివిధ సమస్యలపై పిజిఆర్ఎస్‌లో వచ్చే వినతులపై నిర్లక్ష్యం చేయవద్దని ఆర్‌డిఒ వసంతబాబు సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులు పలు సమస్యలపై ఆర్‌డిఒకు వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులకు ఆయా శాఖల అధికారులు వెంటనే పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల డిఇలు, సిడిపిఒలు, వ్యవసాయ శాఖ ఎడిలు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం

వైకుంఠ ఏకాదశిని పర్వదినాన్ని పురస్కరించుకుని అనంతపురంలోని పాతూరులో వెలసిన లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో భద్రతా ఏర్పాట్లను ఎస్పీ పి.జగదీష్ సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఆలయ పరిసరాల్లో పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల రాకపోకల సౌకర్యాలు, సీసీ టీవీ పర్యవేక్షణ, ఎమర్జెన్సీ స్పందన ఏర్పాట్లను సమీక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, శాంతియుతంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే మహిళలు, వృద్ధులు, దివ్యాంగ భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయ పరిసరాల్లో విజిబుల్ పోలీసింగ్ పెంచాలని, పిక్‌పాకెటింగ్ వంటి నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కేశవనాయుడు, అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, వన్‌టౌన్ సిఐ వెంకటేశ్వర్లు, దేవాదాయశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

అర్జీలకు త్వరితగతిన పరిష్కారం

కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వివిధ సమస్యలపై పిజిఆర్ఎస్‌లో ప్రజలు అందించే అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఓ.ఆనంద్ తెలియజేశారు. కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 467 వినతులను కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారం నాణ్యతగా ఉండాలన్నారు. గడువు ముగిసేలోగా అర్జీలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎలాంటి పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు అర్జీలను పరిష్కరించాలని, ఇందులో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. క్షేత్రస్థాయి అధికారులతో నిత్యం మానిటర్ చేసుకుంటూ అర్జీలను సకాలంలో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్ ఉన్న బియాండ్ ఎస్-ఎల్‌ఏలను శ్రద్ధ పెట్టి పరిష్కరించేలా చూడాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు.

సోషల్ ఫారెస్ట్రీ ఆధ్వర్యంలో మిషన్ హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది 10 లక్షల మొక్కలను నాటడం జరిగిందని, నాటిన మొక్కలకు సంబంధించి ఏపీ ఫారెస్ట్రీ శాఖ అభివద్ధి చేసిన మిషన్ హరితాంధ్రప్రదేశ్ యాప్ డాష్ బోర్డులో అప్లోడ్ చేయాలన్నారు. రెవెన్యూ, డ్వామా, తదితర శాఖల అధికారులు అందరూ పెండింగ్ ఉన్న అప్లోడ్‌ని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ ఏ.మలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామ్మోహన్, మల్లికార్జున, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రచ్చకెక్కిన కార్పొరేషన్ అవినీతి..!

- టౌన్‌ప్లానింగ్, రెవెన్యూపై కలెక్టర్‌కు పాలకవర్గం ఫిర్యాదు
- అవినీతికి అడ్డుకట్ట వేయలేని డిప్యూటీ కమిషనర్
- చెత్త వాహనాలకు డీజిల్ లభించని పరిస్థితి
- కలెక్టర్‌కు ఫిర్యాదులో మేయర్, కార్పొరేటర్లు

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మేయర్, కార్పొరేటర్లు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ విభాగం అవినీతి రచ్చకెక్కింది. ఈ విభాగాల అవినీతిపై సాక్షాత్తు మేయర్, డిప్యూటీ మేయర్లు కార్పొరేటర్లతో కలిసి కలెక్టర్ ఆనంద్‌ను సోమవారం నాడు ప్రజావేదిక కార్యక్రమంలో కలిసి ఫిర్యాదు చేశారు. కార్పొరేషన్‌లో అధికార పార్టీ నేతలు చెప్పిందే వేదంగా కమిషనర్ వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అవినీతిలో రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ ఒకరిని మించి మరొకరు పోటీ పడుతూ కమిషనర్, డిప్యూటీ కమిషనర్లకు కాసుల పంట పండిస్తున్నారంటూ తెలియజేశారు. ఇటీవల నగరంలోని శారదా నగర్‌లో కనకదుర్గ అనే మహిళ పేరుపై ఉన్న ఇంటిని అధికార పార్టీ ముఖ్యనేత అనుచరుడు కాజేసే కుట్ర చేశాస్తున్నారంటూ బాధితులు ఆందోళన చేస్తున్నారు. మీడియా ద్వారా వారికి జరిగిన అన్యాయాన్ని తెలియజేశారు. ఈ విషయంలో ఇంటికి సంబంధించిన పత్రాలను పరిశీలించకుండానే అధికార పార్టీ నేత చెప్పారన్న కారణంతో ఇంటి పన్ను బదలాయింపు వ్యవహారాన్ని రెవెన్యూ విభాగం పర్యవేక్షక అధికార చేశారంటూ పాలకవర్గం చెబుతోంది. ఇంటికి పన్ను విధించే సమయంలో, మార్చే సమయంలో ఆ గృహం పత్రాలు, లింక్ డాక్యుమెంట్స్ పరిశీలించాల్సి ఉంది. ఆస్తులు కొనుగోలు చేశారా.. లేదా వారసత్వంగా వచ్చిందా అన్న అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంది. ఈ పత్రాలన్నీ వాస్తవం అని నిర్ణయించిన తర్వాతనే సంబంధిత అధికారులు ఇంటి పన్ను మార్పు మ్యూటేషన్ చేయాల్సి ఉంది. ఇవేవి చేయకుండానే రెవెన్యూ ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు అధికార పార్టీ నేత అనుచరులు చెప్పిందే తడువుగా నిబంధనలు పక్కన పత్రాలను పరిశీలించకుండానే పన్ను బదాలాయింపులు జరిపారని పాలకవర్గం కలెక్టర్‌కు తెలియజేసింది. పన్ను అసెస్మెంట్ ఖరారు చేయటానికి డిప్యూటీ కమిషనర్ పావని రెవెన్యూ విభాగ పర్యవేక్షకురాలుగా ఉండి గుడ్డిగా సంతకం చేశారని ఫిర్యాదు చేశారు. వేణుగోపాల్ నగర్‌లో ఓ ఇల్లు కొనుగోలు చేసిన ముస్లిం కుటుంబానికి ఇంటి స్థానంలో ఖాళీ స్థలం ఉన్నట్టుగా విఎల్‌టి టాక్స్ విధించటం దాని రిజిస్టర్ ఆఫీసులో గుర్తించి పెండింగ్ ఉంచారంటూ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. నితిన్ కాంప్లెక్స్ వెనుక వైపు ఉన్న గృహాలకు ఐదు పన్ను అసెస్మెంట్లు ఉండగా, వాటి స్థానంలో ఒక అసెస్మెంట్ విధించటం ద్వారా కార్పొరేషన్ ఆదాయానికి గండి పడిందన్నారు. పన్నుల రూపేనా అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయాన్ని రెవెన్యూ విభాగ అధికారులు కాసుల కక్కుర్తితో గండి కొడుతున్నారని పేర్కొన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఉద్యోగోన్నతి పొంది ధర్మవరానికి బదిలీ అయిన టిపిఎస్ అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లోనే కొనసాగేలా అధికార పార్టీ ప్రజా ప్రతినిధి ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆ ఉద్యోగి డిప్యూటేషన్ రద్దుచేసి రిలీవ్ చేయాలని సాక్షాత్తు టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినా కమిషనర్ ఆ ఉద్యోగిని రిలీవ్ చేయకుండా కొనసాగించటం నిబంధనలకు విరుద్ధమని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే సమయంలో నగరంలో అనేక మున్సిపల్ స్థలాలు, ప్రయివేటు ఖాళీ స్థలాలు కనిపిస్తే అధికార పార్టీ నేతలు కబ్జా చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నగరంలో సెల్లార్లు తవ్వాలన్నా, అదనపు ఫ్లోర్లు వేయాలన్నా, బిల్డింగ్ ప్లాన్లు తీసుకోవాలన్నా అధికార పార్టీ ప్రజా ప్రతినిధిని కలిసి ముడుపులు ముట్టజెప్పితే గాని పనులు జరగటం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో టెండర్లు నిర్వహించి పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు చేపట్టడం లేదని కార్పొరేటర్లు మొత్తుకుంటున్నా కమిషనర్ పట్టించుకోవటం లేదని వాపోయారు. చెత్త వాహనాలకు డీజల్ కూడా వేయించలేని స్థితిలో కమిషనర్ ఉన్నారని ఫిర్యాదు చేశారు. కూడళ్లలో చెత్త తరలించడానికి టిప్పర్లు, కంపాక్టర్లకు డీజిల్ ఎనిమిది లీటర్లకు మించి ఇవ్వకపోవడంతో నగరంలోని పారిశుధ్యంపై ప్రభావం చూపుతోందన్నారు. స్టాండింగ్ కమిటీ లీగల్ సభ్యుడిని కౌన్సిల్ అనుమతి లేకుండానే కమిషనర్ అధిక గౌరవ వేతనం చెల్లిస్తూ నియామకాలు జరపటం చూస్తే అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతి పతాక స్థాయికి చేరిందని చెప్పటానికి సిగ్గు పడుతున్నామని పాలకవర్గం సభ్యులు పేర్కొన్నారు. కార్పొరేషన్‌లో అవినీతి, అక్రమాలపై పాలకవర్గం చేసిన ఈ ఫిర్యాదులపై కలెక్టర్ ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

పుట్లూరు రైతులు ఆందోళన చెందొద్దు

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు

పుట్లూరు రైతులు ఎవరూ ఆందోళన చెందొద్దని అందరినీ ఆదుకుంటామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. తుంపెర డీప్ కట్ 72వ కిలోమీటర్ వద్ద సోమవారం ధర్మవరం ప్రాంతానికి చెందిన కొందరు రైతులు అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా కాలువను తెంచి నీటిని తరలించేందుకు ప్రయత్నించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే వెంటనే కలెక్టర్, ఎస్పీ, హెచ్చెల్సీ ఎస్‌సితో మాట్లాడి అక్రమంగా నీటిని తరలిస్తున్న మార్గాన్ని మూసివేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇది సరైన చర్య కాదన్నారు. ఒకవైపు మన ప్రాంత రైతులు, మరోవైపు ధర్మవరం ప్రాంత రైతులు సమస్యలను సామరస్యంగా, పరస్పర అవగాహనతో పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అయితే ఈవిధమైన దౌర్జన్య చర్యలు ఏమాత్రం సమంజసం కాదన్నారు. ధర్మవరం ప్రాంత రైతులు సామరస్యంగా ఆలోచించి సుబ్బరాయసాగర్‌కు వెళ్లే నీటిని అక్రమంగా మళ్లించకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల మధ్య విభేదాలు కాకుండా ఐక్యతతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే పుట్లూరు రైతులు, ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వారి హక్కులను పరిరక్షించేందుకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

రైతులకు న్యాయం చేస్తాం: ఎస్ఇ సుధాకర్ రావు

పులివెందుల బ్రాంచ్ కెనాల్ మూసి వేయడంతో ముచ్చుకుంటపల్లి, రామాపురం, కునుకుంట్ల గ్రామాలకు చెందిన రైతులు తుంపెర హెచ్చెల్సీ డీప్ కట్ వద్దకు సోమవారం భారీగా చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ ఎస్ఇ సుధాకర్‌రావు, జెఇ శ్రీనివాసులు రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగ ఎస్‌సి మాట్లాడుతూ రైతన్నలకు అన్యాయం చేయన్నారు. ఏ రైతుకూ కష్టం రాకుండా సాగునీరు అందించే బాధ్యత తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

రైల్వేస్టేషన్ రోడ్డులో ఆక్రమణలను తొలగించాలి

సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా



వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న ఆక్రమణలు తొలగించి ప్రజలకు సౌకర్యవంతమైన రహదారులు ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మేనేజర్ రాధకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్ మాట్లాడుతూ పట్టణ విస్తీర్ణం పెరిగిన నేపథ్యంలో దానికి అనుగుణంగా రహదారులు వెడల్పు కాలేదన్నారు. రహదారులు ఆక్రమణలకు గురై ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ప్రధానంగా రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి ఆనుకుని ఈ మధ్యకాలంలో పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేశారన్నారు. షాపింగ్ మాల్స్ యజమానులు దాదాపుగా 10 నుంచి 15 అడుగులు మున్సిపల్ స్థలం ఆక్రమించి స్లోపు ఫ్లోరింగ్ ఏర్పాటు చేసి భారీ గేట్స్ రోడ్డుకి అడ్డంగా పెట్టడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడిందన్నారు. షాపింగ్ మాల్స్ వద్ద పెద్ద పెద్ద ఏనుగుల బొమ్మలు పెట్టడం వల్ల నిరంతరం ప్రయాణించే ప్రజలకు చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. ప్రమాదాలు కూడా ఎక్కువ జరుగుతున్నాయన్నారు. మున్సిపల్ అధికారులు ఈ రోడ్డుతోపాటు పట్టణంలోని ప్రధాన రోడ్లలో ఉన్న ఆక్రమణలను తొలగించి ప్రజలకు విశాలవంతమైన రహదారులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో షాపింగ్ మాల్స్ వద్ద పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు సాకే నాగరాజు, కసాపురం రమేష్, రంగమ్మ, పట్టణ కమిటీ సభ్యులు జ్యోతి, షాషా, ఈరన్న, చిన్న, సరస్వతి, పరుశు రాం, నాగరాజు, కర్ణ రాజు, మస్తాన్ పాల్గొన్నారు.

'దుర్గం' పోలీసుల అదుపులో

ద్విచక్రవాహనాల చోరీ ముఠా...?

విచారణలో విస్తు పోయేనిజాలు
సబ్‌జైల్‌లోనే నేరాలకు పథకం
ఇప్పటికే 36 చోరీ బైకులు వెలుగులోకి
ఎస్ఐ, కానిస్టేబుల్ బైకులనూ వదలని ముఠా

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

సినీ ఫక్కీలో ద్విచక్రవాహనాలను చోరీ చేసిన ముఠా తతంగం వెలుగులోకి వచ్చింది. కళ్యాణదుర్గం పోలీసులు వివిధ తనిఖీలు చేపడుతున్న సమయంలో కూపీలాగగా అసలు విషయం తెలిసింది. పోలీసుల విచారణలో విస్తు పోయే నిజాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. వివిధ కేసుల్లో సబ్ జైలులో ఉన్న దుండగులు నేరాలకు పథకం వేసినట్లు తెలుస్తోంది. గతంలో వాహనాల చోరీ కేసులో జైలు జీవితం గడిపినా మార్పు రాని నిందితుడు బెయిల్‌పై బయటకు వచ్చాక తిరిగి వాహనాల చోరీకి తెరలేపినట్లు సమాచారం. బైకులు చోరీ అయ్యాయని 26 మంది మాత్రమే ఫిర్యాదు చేయగా దొంగల ముఠా 36 బైకులు చోరీచేశామని అంగీకరించినట్లు పోలీసుల వర్గాల్లో చర్చజరుగుతోంది. ఇది కాక ఇంకా పదుల సంఖ్యలో చోరీ బైకుల వివరాలు వెలుగుచూసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఎస్ఐ, కానిస్టేబుళ్ల బైకులను కూడా దొంగల ముఠా వదల్లేదు. ఏపీ, కర్నాటక ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలు చోరీ చేశామని దొంగల ముఠా అంగీకరించినట్లు తెలుస్తోంది. విచారణలో దొంగలు ముఠా అంగీకరిస్తున్న వివరాల ఆధారంగా ఇప్పటికే ఫిర్యాదు చేసిన బాధితులతో పాటు ఇంకా బైకులు పోగొట్టుకున్న బాధితుల వివరాలు సేకరిస్తున్నారు.

సబ్‌జైల్లోనే నేరాలకు పథకం

జిల్లాలోని ఓసబ్‌జైలులో గతంలో వాహనాలు చోరీలతో పాటు ఇతర కేసుల్లో కాలం గడుపుతున్న కర్నాటక వాసి అదే సబ్‌జైల్లో ఇతర కేసుల్లో ఉన్న మరోఇద్దరు నిందితులతో కలిసి నేరాలకు పథకం వేసినట్లు సమాచారం. ఇందులో హత్యకేసులో జైల్లో ఉన్న నిందితుడు ఒకరైతే, వేరే కేసుల్లో ఉన్న అనంతపురం ప్రాంతానికి చెందిన యువకుడు మరొకరున్నట్లు తెలుస్తోంది. సదరు నిందితులతో కర్నటకకు చెందిన నిందితుడు తాను బెయిల్‌పై బయటకు వెళ్లగానే మిమల్ని కూడా బెయిల్‌పై బయటకు తీసుకెళ్తానని, తాను చెప్పినట్లు వినాలని హామీ తీసుకున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే బెయిల్‌పై వచ్చిన కర్నాటక నింధితుడు చెప్పిన ప్రకారం డబ్బులు ఖర్చుపెట్టి మరో ఇద్దరికి కూడా బెయిల్ ఇప్పించినట్లు తెలుస్తోంది. నిందితులు బయటకు వచ్చాక గతంలో చేసుకున్న ఒప్పందం మేరకు కర్నాటక నిందితుడి చోరీల చాకచక్యాన్ని అందిపుచ్చుకున్న మరో ఇద్దరు చోరీలకు చేసినట్లు సమాచారం.

ఏపీ, కర్నాటకలో చోరీలు

ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో సదరు ముఠా ద్విచక్రవాహనాలను చోరీచేసినట్లు పోలీసుల విచారణలో భయట పడినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ ఉరవకొండ, ఆత్మకూరు, కళ్యాణదుర్గం, రాప్తాడు, కర్నాటకలోని బెంగళూరు, ఎన్ఎస్.గేట్ ప్రాంతాల్లో వాహనాలు దొంగలించినట్లు సమాచారం. పల్సార్లు, యూనికాన్, స్ప్లెండర్ ప్లస్, ప్యాషన్ ప్రోలు, బుల్లెట్ వాహనాలు చోరీ చేసినట్లు తెలిసింది. ఇందులో ఎస్ఐ, కానిస్టేబుళ్ల బైకులు కూడా నిందితులు దొంగలించినట్లు పోలీస్ శాఖ వర్గాల సమాచారం. ఒక్కొబైకు రూ.10వేల నుంచి రూ.15వేలకు విక్రయించడం, ఆర్‌సీ, ఇతర రికార్డులు ఇచ్చాకా మిగిలిన మొత్తం ఇవ్వాలంటూ దొంగ బైకులను అంటగట్టారు.

ఇప్పటికే 36 చోరీ బైకులు వెలుగులోకి

కళ్యాణదుర్గం పోలీసులు తనదైన శైలిలో విచారణ చేస్తుండడంతో 36 చోరీ బైకుల వ్యవహారం బయట పడినట్లు తెలుస్తోంది. బైకులు పోగొట్టుకున్న బాధితులు 26 మంది మాత్రమే ఫిర్యాదు చేసినట్లు పోలీసు వర్గాలు చెబుతుండగా 36 బైకులు దొంగలించినట్లు విచారణలో వెలుగులోకి రావడం గమనార్హం. అంతేకాకుండా ఇంకా పదుల సంఖ్యలో చోరీ బైకులు విచారణలో వెలుగులోకి వచ్చే అవకాశాలు లేకపోలేదు.

ఒకే గ్రామంలో 11 బైకుల చోరీ

పోలీసుల అదుపులో ఉన్న దొంగల ముఠా కుందుర్పి మండల పరిధిలోని ఒకే గ్రామంలో 11 బైకులు విక్రయించినట్లు బయట పడింది. ఆయా బైకులు కేవలం గ్రామాల్లో మాత్రమే తిరగడానికి వాడుకుంటున్నట్లు సమాచారం. పోలీసులు చేపట్టిన వివిధ తనిఖీల్లో ద్విచక్రవాహనాలు చోరీల తతంగం బయట పడినట్లు తెలుస్తోంది. రాప్తాడు నియోజకవర్గం వైసీపీ నేత కుటుంబ సభ్యుల వివిహ సందర్భం రోజుకూడా సదరు దొంగల ముఠా రెండు బైకులను దొంగలించిన విషయం విచారణలో అంగీకరించడం కొసమెరుపు.

ప్రధాన నిందితుడు కర్నాటక వాసి

ద్విచక్రవాహనాల చోరీ ముఠాలో ప్రధాన నింధితుడిగా కర్నాటక వాసి ఉన్నట్లు తెలుస్తోంది. గంతలోనూ చోరీ కేసులు, ఇతర కేసుల్లో జైలుకు వెళ్లిన చరిత్ర సదరు నింధితునికి ఉన్నట్లు సమాచారం. శెట్టూరు మండలం సమీపంలోని కర్నాటక గ్రామానికి చెందిన వ్యక్తిగా సదరు నిందితున్ని గుర్తించినట్లు తెలియవచ్చింది. గతంలో ఆయన నేరాల చరిత్ర ఆధారంగా పోలీసులు విచారణ చేపడుతున్నారు.

దుర్గం రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయం

విచారణ చేస్తున్నాం ..
రవిబాబు డీఎస్పీ, కళ్యాణదుర్గం

ద్విచక్రవాహనాల చోరీ కేసుల్లో పట్టుబడ్డ ముఠా సభ్యులను విచారిస్తున్నాం. ఇందులో ఇంకా ఎవరిపాత్ర ఉంది. ఎక్కడెక్కడ వాహనాలు దొంగలించారు. అనే కోణంలో విచారణ సాగుతోంది. పూర్తిస్థాయి విచారణ కాగానే అన్ని వివరాలు వెల్లడిస్తాం.

పుట్లూరు ఎస్ఐగా సురేంద్రబాబు

ప్రజాశక్తి-పుట్లూరు

మండల నూతన ఎస్ఐగా సురేంద్రబాబు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకట నరసింహ బదిలీపై తిరుపతికి వెళ్లిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎస్ఐ పోస్టు ఖాళీగా ఉంది. ఈనేపథ్యంలో సురేంద్రబాబును నియమించడంతో బాధ్యతలు చేపట్టారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం అనంతపురంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి టి.నారాయణస్వామి, మండల కార్యదర్శి గంగాధర్, నాయకులు సుధాకర్, పెద్ద పెద్దయ్య, లలితమ్మ, సూరి, నారాయణప్ప, తదితరులుపాల్గొన్నారు.

పారా ఒలింపిక్స్ విద్యార్థులకు అభినందనలు

విద్యార్థులను అభినందిస్తున్న ఎంఇఒ

ప్రజాశక్తి-శింగనమల

జిల్లాస్థాయిలో నిర్వహించిన పారా ఒలింపిక్స్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంఇఒ నరసింహ సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అభినందించారు. అనంతపురంలో నిర్వహించిన పారా ఒలింపిక్స్‌లో ప్రర్తిక, ప్రేమ్‌కుమార్, కృష్ణ, ప్రవీణ్ మొదటి, రెండు స్థానాలు సాధించారు. దీంతో ఆయా విద్యార్థులను ఎంఇఒతోపాటు సిబ్బంది అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-గుత్తి

ఎపిఎస్‌పిడిసిఎల్ గుత్తి డివిజన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఇన్‌ఛార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 220 కెవి రిసీవింగ్ స్టేషన్‌లో పాత పిటిలు, ఎల్ ఏ లు నూతన వాటిని ఏర్పాటు పనులు సందర్భంగా మధ్యాహ్నం మూడు నుంచి సాయంకాలం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-వజ్రకరూరు

వైద్యశిబిరంలో పాల్గొన్న ప్రజలు

పయ్యావుల సోదరుల ఆధ్వర్యంలో ఉరవకొండ మండల పరిధిలోని చిన్న ముష్టూరు గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా ఎల్వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు దాదాపు 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 26 మందికి ముత్య బిందు (క్యాటరాక్ట్), 34 మందికి కళ్ల జోడు, 15 మందికి ఆపరేషన్లు అవసరమని వైద్యులు గుర్తించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాదినేని రవి, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు బాణాల రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'తోపుదుర్తి'దే భూ కబ్జాల సంస్కృతి

ప్రజాశక్తి-ఆత్మకూరు

విలేకరులతో మాట్లాడుతున్న టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నేత బండి పరశురాం

రాప్తాడు నియోజకవర్గంలో భూకబ్జాలు, హత్యా రాజకీయాలు చేసిన సంస్కృతి మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కుటుంబానిదే అని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నేత బండి పరశు రాం ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మారు మాట్లాడుతూ 1995లో బి.యాలేరుకు తన నాన్న బండి ముసలన్న కొన్న భూమికి అన్ని రకాల ప్రభుత్వ రికార్డులు ఉన్నాయన్నారు. అయినా మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఆ భూమిని దౌర్జన్యం లాక్కున్నారని ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. దాదాపు 30 సంవత్సరాలుగా పట్టాదారు పాసు పుస్తకం, అడంగల్‌లో తన నాన్న బండి ముకులన్న పేరే ఉందన్నారు. అయితే గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి దౌర్జన్యంగా భూములు లాక్కొంటూ కేసులు పెట్టి జైలుకు పంపించారని ఆరోపించారు. అంతేగాకుండా తనపై ఎన్నోసార్లు దాడులు చేయించారన్నారు. కురుబలు తమ మామలు అంటున్న ప్రకాష్‌రెడ్డి తనపై ఎందుకు కేసులు పెట్టి.. రౌడీషీట్ పెట్టించాడో చెప్పాలని డిమాండ్ చేశారు. అన్నదమ్ముల మధ్య భూ తగదాలు పెట్టి భూములు లాక్కోవాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సొంత గ్రామాన్ని అభివృద్ధి చేసుకోలేని ప్రకాష్‌రెడ్డి నియోజకవర్గం అంతా ఎప్పుడు అభివృద్ధి చేస్తామని ప్రశ్నించారు. ఈ సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు, నాయకులు శశాంకబాబు, అక్కులన్న, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు

ప్రజాశక్తి-రాప్తాడు

బైక్ ర్యాలీలో పాల్గొన్న సిఐటియు నాయకులు

విశాఖలో ఈనెల 31వతేదీ నుంచి నిర్వహించనున్న సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మన్నీల రామాంజనేయులు పిలుపునిచ్చారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీ సోమవారం మండల కేంద్రానికి చేరుకుంది. ఇందులో భాగంగా సిఐటియు జిల్లా నాయకులు పుష్ప రాజు అధ్యక్షతన ఎంపిడిఒ కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు జాతీయ మహాసభలను రాష్ట్రంలో నిర్వహించడం గర్వకారణమన్నారు. ఈ మహాసభలకు దేశం నలుమూలల నుంచి జాతీయ నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. మహాసభల్లో దేశవ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పోరాటాలు చేసేందుకు కార్యాచరణ రూపొందించనున్నట్లు వివరించారు. కావున కార్మికులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలీలు, లక్ష్మన్న, మధు, మల్లేష్, నారాయణస్వామి, చెన్నప్ప, ప్రకాష్, అజయ్, రాజేష్, పోతలయ్య, నాగేంద్ర, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రంలోని ఎంఆర్‌సి కార్యాలయంలో యుటిఎఫ్ రూపొందించిన డైరీ, క్యాలెండర్‌ను ఎంఇఒ నరసింహారాజు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమాలకు దిక్సూచిగా యుటిఎఫ్ పని చేస్తోందన్నారు. రాబోయే సంవత్సరంలో ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లడానికి యుటిఎఫ్ సక్రమమైన సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, రాష్ట్ర కౌన్సిలర్ గోవిందరాజులు, ఎంఆర్‌సి సిబ్బంది, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ ఇవ్వాలి

కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య

ప్రజాశక్తి-వజ్రకరూరు

వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతుసంఘం నాయకులు

కౌలు రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఉరవకొండలోని సిఐటియు కార్యాలయంలో రంగారెడ్డి అధ్యక్షతన కౌలు రైతుల సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన విధంగా కౌలు రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా అన్నదాత సుఖీభవ విడుదల చేయాలన్నారు. అదేవిధంగా బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిసిఆర్‌సి కార్డులు ఉన్న ప్రతి కౌలు రైతుకూ ఈ క్రాప్ నమోదు చేసి కౌలు రైతుల పేరుతో పంట కొనుగోలు చేసి నగదు అకౌంట్లలో జమ చేయాలన్నారు. అలాగే కంది పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి క్వింటా రూ.10వేల చొప్పున కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ మహబూబ్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పెద్ద ముష్టూరు వెంకటేసులు, రైతుసంఘం నాయకులు శ్రీనివాసులు, సుంకన్న, శంకరప్ప, వెంకటరమణ, ధనుంజయ, సుధాకర్, సురేష్, రామాంజనేయులు, తిప్పమ్మ, నాగవేణి, ఎర్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ అర్జీలకు పరిష్కారం చూపాలి

ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ పి.జగదీష్

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి పిటిషన్‌ను చట్ట పరిధిలో విచారించి పరిష్కారం చూపాలని ఎస్పీ పి.జగదీష్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 70 ఫిర్యాదులు వచ్చారు. ఇందులో భాగంగా పిటీషనర్లతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లోతుగా వారి సమస్యలను విని అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భార్యాభర్తల గొడవలు, కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు, తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐపిఎస్ అశ్విని మణిదీప్, అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

రాయదుర్గం : కణేకల్లు పట్టణంలో ఇటీవల జరిగిన బంగారు, వెండి ఆభరణాల చోరీ కేసులో నిందితుడు ఆఫ్గాన్ రజాక్‌వలిని సోమవారం మధ్యాహ్నం కణేకలు క్రాస్ బస్‌స్టాఫ్ వద్ద అరెస్టు చేసినట్లు రాయదుర్గం రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ తెలిపారు. సోమవారం సాయంత్రం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కణేకల్ పట్టణానికి చెందిన తబుసం, లతీఫ్ తమ బంధువుల ఇంట్లో శుభకార్యం నిమిత్తం ఇంటికి తాళం వేసి ఈనెల 22న వెళ్లారు. ఈనేపథ్యంలో ఇంటి వెనుకవైపు తలుపు విరగగొట్టి, బీరువా తాళం తెరిచి అందులో ఉన్న రూ.12 లక్షల విలువైన 10 తులాల బంగారు ఆభరణాలు, కిలో వెండి ఆభరణాలను చోరీ చేసినట్లు ఫిర్యాదు చేశారన్నారు. 27న కేసు నమోదు చేసి అనంతపురం నుంచి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ను పిలిపించి సమాచారం సేకరించినట్లు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చోరీ జరిగిన ఇంటికి సమీపంలోనే ఉన్న రజాక్ వలి ఈ చోరీ చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు. నిందితుడు మద్యం, క్రికెట్ బెట్టింగ్, తదితర వ్యసనాలకు అలవాటు పడి అప్పులు చేసి వాటిని తీర్చేందుకు తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడుతున్నట్లు తెలిసిందన్నారు. అతనిపై ఇదివరకే నాలుగు కేసులు నమోదయి ఉన్నట్లు చెప్పారు. 22న రాత్రి లతీఫ్ ఇంట్లో చోరీ చేసి చోరీ అయిన ఆభరణాలను తన సోదరుడి ఇంట పెట్టి వాటిని అమ్మేందుకు బళ్లారి వెళ్లేందుకు ప్రయత్నిస్తూ కణేకల్ క్రాస్ వద్ద పోలీసులకు పట్టుబడినట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. కేసు నమోదైన 48 గంటల్లోగా నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. చోరీ కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన సిఐ వెంకటరమణ, కణేకల్ ఇన్‌ఛార్జి ఎస్ఐ నబిరసూల్, ప్రొబెషన్ ఎస్ఐ నారాయణరెడ్డి, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

మోటార్ల కేబుల్ వైరు చోరీ

పుట్లూరు : మండల పరిధిలో సంజీవపురం, సూరేపల్లి గ్రామాల్లోని తోటల్లో మోటార్ల కేబుల్ వైర్లు ఆదివారం రాత్రి చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు. సంజీపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులురెడ్డి, బాబు సూరేపల్లి గ్రామానికి చెందిన అల్లీపీరా, నాగేంద్ర, తదితర రైతులకు సంబంధించిన దాదాపు ఎనిమిది మోటార్ల కేబుల్ చోరీకి గురైనట్లు బాధిత రైతులు వాపోయారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి : మండలంలోని రజాపురం గ్రామంలో సోమవారం ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన షకీలా అనారోగ్య సమస్యలతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో విష ద్రావకం తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆమెను గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

సిపిఎం ఆధ్వర్యంలో వినతి

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల కేంద్రం సమీపంలోని పూసల కాలనీ, ఇందిరమ్మ కాలనీలో కనీస మౌలిక వసతులు కల్పించాలని ఆయా కాలనీవాసులు కోరారు. ఈమేరకు సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఆర్.కుళ్లాయప్ప మాట్లాడుతూ పూసల కాలనీ, ఇందిరమ్మ కాలనీల్లో రోడ్డు, డ్రెయినేజీలు, రోడ్లు లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాత్రిళ్లు భయంభయంగా గడపాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు అవుతున్నా కనీస మౌలిక వసతులు కల్పించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఆయా కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుల్లయ్య, నాగరాజు, చంటి, ఎర్రన్న, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎంపిటిసిలు, ఎంపిపిలకు గౌరవేతనాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-కూడేరు

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జిల్లాలోని ఎంపిటిసిలు, ఎంపిపిలకు గౌరవ వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఎంపిపిల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి కోరారు. ఈమేరకు సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ ఓ.ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిటిసిలు, ఎంపిపిల సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంపిపిల సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, రాప్తాడు ఎంపిపి భర్త సత్యనారాయణరెడ్డి, కొర్రకోడు ఎంపిటిసి శిలాల్‌రెడ్డి, ఎర్రగుంట్ల ఎంపిటిసి రాముడు, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు..అండగా ఉంటాం..

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ-వీడియో కాల్‌లో విద్యార్థినులతో మాట్లాడిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శింగనమల

ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

విద్యార్థులు ఎవరూ అందోళన చెందొద్దని.. మీకు అండగా ఉంటానని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హామీ ఇచ్చారు. మండల కేంద్రంలోని కెజిబివి హాస్టల్‌లో పని చేస్తున్న ఓ టీచర్‌ను బదిలీ చేయడాన్ని తట్టుకోలేక విద్యార్థినులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ విద్యార్థినులతో వీడియో కాల్‌లో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమ టీచర్‌ను బదిలీ చేయొద్దని విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే గతంలో జరిగిన కొన్ని తప్పిదాల కారణంగానే సంబంధిత టీచర్‌కు బదిలీ చేశారని విద్యార్థినులకు వివరించారు. విద్యార్థినులు ఎలాంటి ఆందోళనకు లోనవ్వవద్దని, హాస్టల్ ఇన్‌ఛార్జిగా కెజిబివి ఎస్ఒ గీతారాణి ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. విద్యార్థినులు చదువుపై దృష్టి పెట్టాలే తప్ప ఆందోళనలు చేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా పరిష్కరిస్తామని స్పష్టంగా చేశారు.

ప్రజాశక్తి క్యాలెండర్లు ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపిడిఒ మమతాదేవి

ప్రజాశక్తి-నార్పల

ప్రజాశక్తి దినపత్రిక రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ మమతాదేవి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ వాస్తవాలను నిర్భయంగా, నిస్వార్థంగా ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రజల పక్షంగా నిలుస్తున్న ప్రజాశక్తి పత్రిక అందరి ప్రేమాభిమానాలతో భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శేషరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సుభహాన్, జూనియర్ అసిస్టెంట్ రవీంద్రనాథ్‌రెడ్డి, ప్రజాశక్తి పాత్రికేయుడు షేర్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : ప్రజాశక్తి దినపత్రిక రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ షర్మిల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ 'ప్రతి అక్షరం ప్రజల పక్షం' నినాదంతో ప్రజాశక్తి దినపత్రిక ప్రజల గొంతుకుగా నిలవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

డి.హీరేహాల్ : ప్రజాశక్తి దినపత్రిక రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సిఐ వెంకటరమణ, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాస్తవాలను నిర్భయంగా, నిస్వార్థంగా ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రజల పక్షంగా నిలుస్తున్న ప్రజాశక్తి దినపత్రిక అందరి ప్రేమాభిమానాలతో భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

డి.హీరేహాల్‌లో ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐ వెంకటరమణ, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి
www.prajasakti.com

ప్రజలతో మాట్లాడుతున్న ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ తోలేటి

డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండికి 50 వినతులు

ప్రజాశక్తి-అనంతపురం

ఎపిఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'డయల్ యువర్ సిఎండి' కార్యక్రమంలో 50 వినతులు అందినట్లు సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. సంస్థ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను విన్నవించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో జాప్యం, విద్యుత్ లైన్ మార్పు, లో–ఓల్టేజ్ సమస్య, ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యం పెంపు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, బిల్లింగ్ తదితర సమస్యలు వీటిలో ఉన్నాయి. అనంతరం సిఎండి మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ కె.గురవయ్య, డైరెక్టర్, ఫైనాన్స్ (ఎఫ్‌ఎసి) కె.రామమోహన్‌రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు పిహెచ్.జానకిరామ్, జె.రమణాదేవి, కె.ఆదిశేషయ్య, ఎం.మురళీకుమార్, ఎం.ఉమాపతి, జనరల్ మేనేజర్లు కృష్ణారెడ్డి, రామచంద్రారావు, చక్రపాణి, సురేంద్రరావు, భాస్కర్‌రెడ్డి, జగదీష్, ప్రసాద్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

హద్దులు మీరితే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి-శింగనమల

నూతన సంవత్సర వేడుకల పేరుతో హద్దులు మీరి ప్రవర్తించి మండల వ్యాప్తంగా ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ కౌలుట్లయ్య సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు డిసెంబర్ 31వతేదీన సాయంకాలం 4 నుంచి జనవరి 1వతేదీ ఉదయం 9 గంటల వరకూ హోటళ్లు, రెస్టారెంట్లు, డాబాలు, మద్యం దుకాణాలను మూసివేయాలన్నారు. న్యూ ఇయర్ అంటూ రోడ్లపైకి వచ్చి, మద్యం తాగడం, ద్విచక్ర వాహనాలు తిప్పడం, మద్యం తాగి ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. పోలీస్ వ్యవస్థ నిబంధనలను ప్రజలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. శింగనమల సర్కిల్ పరిధిలోని శింగనమల, గార్లదిన్నె, నార్పల మండలాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, అల్లర్లకు తావు లేకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు. విషయాన్ని ప్రజలు, యువకులు, యువత, తల్లిదండ్రులు గమనించి పోలీసు వ్యవస్థ ఇచ్చిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

మరుగుదొడ్లు నిర్మించాలని వినతి

ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండల కేంద్రంలో మరుగుదొడ్లు నిర్మించాలని సిపిఎం ఆధ్వర్యంలో ఎంపిడిఒ బారెన్‌సాహెబ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి దస్తగిరి మాట్లాడుతూ మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి పెద్దవడుగూరుకు వస్తుంటారన్నారు. దీంతో మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా మహిళల బాధలు వర్ణణాతీతంగా ఉన్నాయన్నారు. కావున వెంటనే మరుగుదొడ్లు నిరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు నారాయణస్వామి, మైనారిటీ నాయకులు మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయం నిర్మాణానికి స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని అయ్యప్ప స్వామి భక్తమండలి సభ్యులు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్ల నుంచి అయ్యప్ప స్వామి భక్తులు ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారన్నారు. అయితే అయ్యప్ప స్వామి ఆలయం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున ఆలయ నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శింగనమల అయ్యప్ప భక్తమండలి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న అయ్యప్పస్వామి భక్తులు

తాడిపత్రి గ్రీవెన్స్‌లో పాల్గొన్న ట్రైనీ కలెక్టర్

ప్రజలతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ సచిన్‌రహార్

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

మండలంలో ఆలూరు గ్రామంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సచిన్‌రహార్ పాల్గొని ప్రజల ఉనంచి వినతులను స్వీకరించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సచిన్ రహార్ ఆప్యాయంగా అందరినీ పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అరటి పంట పరిశీలన

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

తాడిపత్రి డివిజన్ పరిధిలోని ముచ్చుకోట, రావివెంకటాంపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన అరటి పంటను నాబార్డు అధికారులు సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా అరటి సాగులో మెళకువలను రైతులకు వివరించారు. అదేవిధంగా సాగు చేసుకున్న అరటిని మార్కెటింగ్ చేసుకునే విధివిధానాలను ఢిల్లీ నుంచి విచ్చేసిన నాబార్డ్ టీం అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ వ్యవసాయ అధికారి లక్ష్మానాయక్, అధికారులు అనురాధ, నవీన్‌కుమార్, రవీంద్ర, నారాయణస్వామి, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

అరటి రైతులతో మాట్లాడుతున్న నాబార్డ్ అధికారులు

ప్రజలకు అందుబాటులో ఉంటా

టిడిపి అనంతపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులు ప్రసాద్

ప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-బెలుగుప్ప

ప్రజలకు అందుబాటులో ఉంటూ అర్హులకు సంక్షేమ పథకాలు అందించడంతోపాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టిడిపి అనంతపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులు ప్రసాద్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని నరసాపురం గ్రామంలో టిడిపి నాయకులు తగ్గుపర్తి రాధాకృష్ణ అధ్యక్షతన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మంత్రి పయ్యావుల కేశవ్ సోదరుల సహకారంతో టిడిపి పార్లమెంట్ ఉపాధ్యక్షులుగా నియమితులైనట్లు తెలిపారు. పయ్యావుల సోదరులకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో నరసాపురం మురళీ, దుద్దేకుంట వైస్ ఎంపిపి తిమ్మప్ప, టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున, పెద్దతిప్పయ్య, నారాయణస్వామి, పవన్‌కుమార్, సునీల్, రామ్మోహన్ చౌదరి, గ్రామ కమిటీ అధ్యక్షులు పాలెప్ప, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదుకోండి.. సారూ..

చోరీకి గురైన గొర్రెలు
ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం..
ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకోలు

బాధితురాలు శ్రీదేవి

ప్రజాశక్తి-కుందుర్పి

'నిరుపేదలం.. ఉన్న పుస్తెలను అమ్ముకుని గొర్రెలు తెచ్చుకుని మేపుకుంటూ జీవనం సాగించే వారం.. ఉన్నట్టుండి గుర్తు తెలియని వ్యక్తులు గొర్రెలను చోరీ చేసి దిక్కు లేని వాళ్లను చేశారు... కుటుంబ పోషణ భారమైంది... ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం ఆదుకోండి..' అంటూ ఓ బాధిత కుటుంబం వేడుకుంటోంది. వివరాల్లోకి వెళ్తే... మండల కేంద్రానికి చెందిన చాకలి శ్రీదేవి కుటుంబం తనకున్న బంగారాన్ని తాకట్టు పెట్టి 16 గొర్రెలను తెచ్చుకుని మేపుకుంటూ జీవనం సాగించేది. అయితే మూడు రోజుల క్రితం తమ ఇంటి వద్ద షెడ్డులో ఉంచుకున్న గొర్రెలను గుర్తుతెలియని దుండగులు దొంగలించారు. తెల్లవారు జామున గమణించిన కుటుంబ సభ్యులు లబోదిబోమన్నారు. ఉదయం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుతో స్పందించిన ఎస్‌ఐ ఘటనా స్థలం నుంచి సుమారు 20 కిలోమీటర్ల వరకూ అందుబాటులో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. అయినా దొంగల ఆచూకీ లభించలేదు. ఇంతలోపే ఉన్న ఎస్‌ఐ బదిలీ అయ్యారు. కూలినాటి చేసుకుని జీవించే తాము గొర్రెలను మేపుకోవడమే జీవనాధారమని, అలాంటి జీవనాధారాన్ని గుర్తు తెలియని దుండగులు దోచుకున్నారని శ్రీదేవి వాపోతోంది. గొర్రెల చోరీతో సుమారు రూ.1.50లక్షల వరకూ నష్టపోయామని తెలిపింది. అంతేగాకుండా జీవనాధారం కోల్పోయామన్నారు. దీంతో పూట గడవని స్థితిలో ఉన్నట్లు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఎమ్మెల్యే సురేంద్రబాబు స్పందించి ఆదుకోవాలని వేడుకుంటోంది. ఇప్పటికైనా పోలీసులు స్పందించి గొర్రెలను చోరీ చేసిన నిందితులను పట్టుకుని ఆదుకోవాలని శ్రీదేవి కోరుతోంది.

ఉత్తర ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు

ప్రజాశక్తి-రాయదుర్గం

వైకుంఠ ఏకాదశి సందర్భంగా పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ పాలక మండలి అధ్యక్షులు నల్లపూల వెంకటేశులు, దేవాదాయ శాఖ సమూహ ఆలయాల కార్యనిర్వహణాధికారి కె.నరసింహారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏకాదశి సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున 1గంటకు అభిషేకం, 4 గంటలకు ఉత్సవ మూర్తులను ప్రత్యేక వాహనంపై ఉంచి అలంకరించి మేళతాళాలతో సంతాన వేణుగోపాల స్వామి, లక్ష్మీ బజార్లోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయం వరకూ ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్కడ పూజలు నిర్వహించిన అనంతరం తిరిగి ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయానికి చేరుకుంటారన్నారు. అక్కడ గర్భగుడిలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. ఉత్తర ద్వారానికి పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి భక్తుల దర్శనానికి అనుమతిస్తామన్నారు. అనంతపురం నగరానికి చెందిన భార్గవ్ అను భక్తుడు బెంగళూరు నుంచి ప్రత్యేకంగా పూలను తెప్పించినట్లు తెలిపారు. కాగా రాయదుర్గానికి చెందిన నారాయణరాజు, ఆయన కుమారుడు పవన్ రాజ్ పంచలోహ వరాహ కవచాన్ని కానుకగా ఇచ్చినట్లు తెలిపారు.

స్వామివారికి వరాహ కవచాన్ని అందజేస్తున్న నారాయణరాజు, పవన్ రాజ్

నాగరాజుకు బొకే అందజేస్తున్న సంగా తేజస్విని

టిడిపి జిల్లా అధ్యక్షుడిని కలిసిన సంగా తేజస్విని

ప్రజాశక్తి-అనంతపురం

ఇటీవల నూతనంగా నియమితులైన టిడిపి జిల్లా అధ్యక్షులు పూల నాగరాజును సోమవారం అనంతపురం పార్లమెంటు కార్యాలయంలో తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని వాల్మీకి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు టిడిపి ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరినికలిసి శుభాభినందనలు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురంలోని కార్యాలయంలో కలెక్టర్ ఆనంద్‌ను ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా చేస్తున్న సేవలను కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బద్దేనాయక్ మిత్రుడు దేగావత్ రవీంద్రనాయక్, తదితరులు ఉన్నారు.

30, 31న జాబ్‌మేళా

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 30, 31వతేదీల్లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.నరసింహారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ అశోక్ లేలాండ్, జికెఎన్ ఆటోమోటివ్, రెనాల్ట్, వోల్వో సంస్థకు చెందిన వారు జాబ్‌మేళాలో పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నట్లు తెలిపారు. ఐటిఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ చదివిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగాలు సాధించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సెల్.. 98984 00832 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

టిడిపి సీనియర్ నాయకురాలు లీలావతికి సన్మానం

ప్రజాశక్తి-శింగనమల

టిడిపి సీనియర్ నాయకురాలు బండారు లీలావతిని మండల టిడిపి నాయకులు సోమవారం అనంతపురంలోని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కార్యాలయంలో ఘనంగ ఆసత్కరించారు. ఇందులో భాగంగా శింగనమల మార్కెట్ యార్డు ఛైర్మన్ దండు శ్రీనివాసులు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కాయల అనిల్‌కుమార్‌యాదవ్, చెరువు ఆయకట్టు ఛైర్మన్ బోయ సత్యనారాయణ, తదితరులు లీలావతికి బొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. లీలావతిని కలిసిన వారిలో మాజీ జడ్పిటిసి తరిమెల రామకృష్ణ, టిడిపి నాయకులు దాసరి గంగాధర్, బెస్త నారాయణస్వామి, బోయ సుధాకర్, తదితరులు ఉన్నారు.

లీలావతికి బొకే అందజేస్తున్న టిడిపి నాయకులు

యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-శెట్టూరు

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని సోమవారం శెట్టూరు మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జిలాన్ బాషా, తహశీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపిపి లక్ష్మీదేవి, వైస్ ఎంపిపి క్రిష్టప్ప, సర్పంచు కుమార్, ఎంఇఒలు శ్రీధర్, వాణీదేవి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫిరోజ్, అధ్యక్షులు రాజన్న, ప్రధాన కార్యదర్శి అజయ్, జిల్లా కార్యదర్శి ఓబులేష్, జిల్లా అడిట్ కమిటీ సభ్యులు అబ్దుల్ వహబ్, తిప్పేస్వామి, చిరంజీవి, మంజునాథ్, మహేష్, వెంకటేష్, శంకర్, రమేష్‌నాయక్, ఈరన్న, రఘునందన్, చంద్రబాబు, మారెప్ప, విశ్వనాథ్, శివరాజు రూప, ఖలీల్ పాల్గొన్నారు.

యాడికి : మండల కేంద్రంలోని ఎంఆర్‌సి కార్యాలయంలో ఎపిటిఎఫ్ (ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్)–2026 సంవత్సర నూతన క్యాలెండర్, డైరీలను మండల విద్యాధికారులు కాసెప్ప, సీతారామాంజనేయులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ఎపిటిఎఫ్ ఆవిర్భావం నుంచి ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటాలు కొనసాగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు నూర్ మహమ్మద్, రామాంజి, జిల్లా కౌన్సిలర్ నబిరసూల్, సంఘ సభ్యులు రవికుమార్ కృష్ణమూర్తి, చంద్రశేఖర్, రామాంజనేయులు, జయరామిరెడ్డి, తదితరుల పాల్గొన్నారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి

ప్రజాశక్తి-కూడేరు

వచ్చేనెల 2వతేదీ నుంచి మండల పరిధిలోని గొట్కూరు, కమ్మూరు గ్రామ రెవెన్యూ పంచాయతీల్లో చేపట్టనున్న రీ సర్వేకు రైతులు సహకరించాలని రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్ కోరారు. ఈమేరకు సోమవారం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామసభల్లో ఆయన మాట్లాడుతూ మీకు కేటాయించిన తేదీల్లో రైతుల అందరూ తమ పత్రాలను అధికారులకు చూపి రీసర్వేకు సహకరించాలన్నారు. అనంతరం ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ అయేషా సిద్ధిక, వీఆర్వోలు కుళ్లాయిస్వామి, రామకృష్ణ, గ్రామ పంచాయతీ సెక్రటరీ హరినాథ్, కమ్మూరు సర్పంచు చిన్న రంగారెడ్డి, మాజీ జడ్పిటిసి రామచంద్ర, కమ్మూరు బాషా, ఎర్రిస్వామి, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

2 నుంచి గ్రామసభలు

ప్రజాశక్తి-యల్లనూరు

ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి 2 నుంచి 9వతేదీ వరకూ రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ రాము సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రీసర్వే జరిగిన ప్రాంతాల్లో భూ యజమానులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందించాలనే ఉద్దేశంతో గ్రామసభలు నిర్వహించేందుకు ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు తెలిపారు. 2న కచర్లకుంట, 3న నిట్టూరు, 6న ఆరవేడు, 7న మల్లగుండ్ల, 8న కోడుమూర్తి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రైతులకు పాసు పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

సర్టిఫికెట్లు పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో నిర్వహించిన 'డ్రగ్స్ వద్దు బ్రో–సైకిల్ తొక్కు బ్రో' అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, యువకులు, సామాజిక కార్యకర్తలకు సోమవారం స్థానిక కార్యాలయంలో ఎస్పీ పి.జగదీష్ సర్టిఫికెట్లను అందజేశారు. జిల్లా పోలీస్ శాఖ, ప్రత్యేకంగా ఈగల్ టీమ్ కలిసి సమన్వయంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో ప్రధానంగా యువతలో డ్రగ్స్ వినియోగంపై అవగాహన పెంచడం, ఆరోగ్యకరమైన జీవనశైలి, సైక్లింగ్ వంటి సృజనాత్మక, శారీరక కార్యకలాపాల ద్వారా జీవితాన్ని సానుకూలంగా మార్చుకోవచ్చని బోధించడమే లక్ష్యంగా ర్యాలీ నిర్వహించారు. ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనడం స్ఫూర్తిదాయకంగా సర్టిఫికెట్లను అందజేశారు.

గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి చర్యలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

టిడిపిని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేస్తామని ఆపార్టీ జిల్లా నూతన అధ్యక్షుడు ఎమ్మెస్ రాజు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం పుట్టపర్తికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుమప్ప, తెలుగుదేశం నాయకులు సామకోటి ఆదినారాయణ, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి అంబులెన్స్ రమేష్, ఘన స్వాగతం పలికారు. అనంతరం తెలుగుదేశం పార్టీ జిల్లాలో నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యులందరూ పార్టీ అభివృద్ధికి, కార్యకర్తల సంక్షేమానికి పనిచేయాలని సూచించారు. అనంతరం పలువురు ఎమ్మెస్ రాజును సన్మానించారు. అనంతరం పుట్టపర్తి తెలుగుదేశం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పల్లె సింధూర రెడ్డి ని పల్లె రఘునాథ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి పార్టీ బలోపేతానికి చేయాల్సిన కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పుట్టపర్తి మండల కన్వీనర్ రామాంజనేయులు, శ్రీరామ్ రెడ్డి, బేకరీ నాయుడు, ఓడిసి కన్వీనర్ జయచంద్ర, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు

కుళ్లాయిస్వామికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-నార్పల

కొద్ది రోజుల క్రితం రైలు కింద పడి రెండు కాళ్లు పోగొట్టుకున్న నార్పలకు చెందిన పెరవలి కుళ్లాయిస్వామికి నార్పల టీం వర్క్ వాట్సాప్ సభ్యులు సోమవారం రాత్రి ఆర్థికసాయం అందించారు. పెరవలి కుళ్లాయిస్వామికి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ఈనేపథ్యంలో రైలు ప్రమాదంలో కాళ్లు కోల్పోవడంతో పూట గడవడానికి కూడా చాలా ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న నార్పల టీం వర్క్ వాట్సాప్ సభ్యులు బాధితుడి ఇంటికి చేరుకుని రూ.24,000 ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థుల వినతి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

కళాశాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సు నడపాలని మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ మునివేలుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ మండల కేంద్రంలోని కళాశాలకు రోజూ పలు గ్రామాల నుంచి విద్యార్థులు వస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో సమయానికి బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కావున కళాశాల సమయానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సు నడపాలని కోరారు. ఇందుకు తహశీల్దార్ స్పందిస్తూ విషయాన్ని ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా జిసి.నరేష్

ప్రజాశక్తి - రొద్దం

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా జిసి. నరేష్ కుమార్‌ను ఎంపిక చేసినట్లు ఆ యూనియన్ నాయకులు తెలిపారు. ఆదివారం మడకశిరలో జరిగిన 4వ జిల్లా మహాసభలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామన్నారు. యుటిఎఫ్ కార్యదర్శిగా రొద్దంమండలం లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న జిసి నరేష్ కుమార్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఆదిజినేష్ జైన్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు గాను, జిల్లా సాంస్కృతిక కమిటీ కన్వీనర్‌గా సానిపల్లి గంగాధర్ ఎన్నుకునక్నట్లు చెప్పారు. ఈసందర్భంగా నరేష్‌కుమార్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో గుడిబండ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - గుడిబండ

హిందూపురంలోని ఏ ఎం లింగన్న మెమోరియల్ హై స్కూల్ సేవా మందిరంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి అబాకస్, మరియు వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో గుడిబండ విద్యార్థి ప్రతిభ కనపర్చారు. గుడిబండలోని సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 6 వ తరగతి చదువుతున్న వివేకానంద ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడని ఆ పాఠశాల హెచ్‌ఎం తెలిపారు. ప్రతిభా విద్యార్థిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

ప్రజాశక్తి-పెనుకొండ

2011కు ముందు నియామకం పొందిన ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు నిబంధనలు అమలు చేయాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్టీఎ)రాష్ట్ర అధ్యక్షులు కాడిశెట్టి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు డి.మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో ఎపియస్టీఏ 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్ సర్వీసు ఉపాధ్యాయులు టెట్ విషయంలో ఆందోళన చెందుతున్నారని టెట్ మినహాయింపు ఇచ్చి వారికి ఉపశమనం కలిగించాలని అన్నారు. ప్రతిరోజూ అత్యవసరం అంటూ ఏదో ఒక బోధనేతర పని చేయిస్తూ విద్యాశాఖను అత్యవసర శాఖగా మార్చారని ఇది విద్యా వ్యవస్థ పురోగతికి ఎంత మాత్రం తోడ్పడదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని సొసైటీ, గురుకుల రెసిడెన్షియల్ ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి పుల్లయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవి. కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జయకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సి.నరేష్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ మక్కిశెట్టి కుమార్, కోశాధికారి ప్రదీప్ కుమార్, జిల్లా, డివిజన్ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, కె.కిష్టప్ప, కె.మారుతి, జి.శ్రీనివాసులు, దారా కిష్టప్ప, గాజుల సౌజన్య, కరిబసప్ప, పెనుకొండ డివిజన్ నాయకులు ఎన్.శ్రీనివాసులు విజయకుమార్, బాబు, మహేష్, లక్ష్మేనాయక్, నాగేంద్ర, డి.శ్రీనివాసులు, గోవిందనాయక్, తదితరులు పాల్గొన్నారు.

జోనల్ లెవెల్ పోటీల్లో ముదిగుబ్బ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ఈనెల 27, 28 తేదీలలో హిందూపురం ఎం.జీ.ఎం. పాఠశాలలో నిర్వహించిన జోనల్ లెవెల్ జూడో పోటీలలో ముదిగుబ్బ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనపర్చి పతకాలు సాధించినట్లు పీడీ చామంతి తెలిపారు. హారిక, శృతి బంగారు, షర్మిల, వనజ, చాందిని వెండి, మహేశ్వరి, పూజిత, అలేఖ్య, సబిహాఖానం కాంస్య పతకాలు సాధించి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారని పీడీ చెప్పారు. అలాగే ఆర్డీటీ ధ్వర్యంలో పెనుకొండ లో నిర్వహించిన ఓవరాల్ జూడో లీగ్ చాంపియన్ షిప్ లో ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. ప్రతిభా విద్యార్థులను హెచ్‌ఎం రమాదేవి, ఎంఇఒలు వెంకటాచలపతి, రమణప్ప , పీడీలు రేఖ, చామంతి, ఉపాధ్యాయులు అభినందించారు.

కిసాన్ డ్రోన్ ద్వారా నానో యూరియా పిచికారీ

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల కేంద్ర సమీపంలో ఉన్న వెలుగుట్టువారిపల్లి రైతు బి లక్ష్మీ నర్సారెడ్డి పొలంలో సోమవారం కిసాన్ డ్రోన్ ద్వారా నానో యూరియా పిచికారీ ప్రదర్శన నిర్వహించినట్లు వ్యవసాయ అధికారి సయ్యద్ షాదాబ్ తెలిపారు ఈ కార్యక్రమానికి ఎడిఎ సనావుల్లా హాజరై పలు సూచనలు చేశారన్నారు. ఇది రైతులకు ఉపయోగం ఎంతో ఉపయోగమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, టిడిపి మండలకన్వీనర్ వెంకటప్రసాద్, సింగల్ విండో అధ్యక్షుడు పి రామానుజుల రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు వెంకటరమణ రెడ్డి, మాజీ సర్పంచి కె రవీందర్ రెడ్డి, రైతులు రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య ,ఆరోగ్యశాఖ అసోసియేషన్ అధ్యక్షునిగా బాబాఫక్రుద్దీన్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఆంధ్రప్రదేశ్ వైద్య ,ఆరోగ్యశాఖ మినిస్ట్రియల్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా బాబా ఫక్రుద్దీన్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర నాయకుల నుండి ఉత్తర్వులు అందాయి. రాష్ట్ర అధ్యక్షులు రమేష్ ఆదేశాల మేరకు ప్రసాద్ అధ్యక్షతన సోమవారం శ్రీ సత్యసాయి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నుకున్నట్లు తెలిపారు.వైద్య ఆరోగ్య శాఖలో సీనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న కె బాబా ఫక్రుద్దీన్ జిల్లా అధ్యక్షునిగా, సెక్రటరీగా జయచంద్ర, ట్రెజరర్ గా బిఎస్ జావిద్ ,అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి లక్ష్మీనారాయణను ఎన్నుకున్నారు. వీరితోపాటు ఐదుగురు వైస్ ప్రెసిడెంట్లను , ఐదుగురు సెక్రటరీలను ,ఆరుగురు ఈసీ మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో మినిస్టర్ సర్వీసుకు సంబంధించి నెలకొన్న సమస్యలను, ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కార మార్గాలు చూపుతామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఎదుర్కొంటున్న సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి యూనియన్ కృషి చేస్తుందని చెప్పారు.

సిఐటియు ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ

ప్రజాశక్తి - నల్లమాడ

సిఐటియు జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ నల్లమాడ మండలంలో సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. బీసీ హాస్టల్ నుంచి వైయస్సార్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకుడు గోవిందు, రైతు సంఘం నాయకుడు మాధవరెడ్డి, సిఐటియు నాయకులు వెంకటరమణ, వినోద్, రమణ తదితరులు పాల్గొన్నారు

కరాటే బెల్ట్ పరీక్ష

ప్రజాశక్తి - కదిరిటౌన్

మాస్టర్ షాకీర్ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ పరీక్ష కదిరి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో విద్యార్థులకు సోమవారం నిర్వహించారు. కలర్ బెల్ట్స్, సీనియర్ బ్రౌన్ బెల్ట్స్ పరీక్షలో మొత్తం 25 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని నిర్వాహకులు తెలిపారు.